సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 3 । అక్టోబర్ । 2024



గుప్త నిధుల ముఠా విధ్వంసం

గుప్త నిధుల ముఠా సభ్యులు ఆలయాలను సైతం వదలడం లేదు. గుప్త నిధులు ఉంటాయనే ఆశతో ఆలయం ఎదుట ప్రతిష్టించిన ధ్వజస్తంభాన్ని సైతం పెకిలించేశారు. -8లో



విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

విశాఖ ఉక్కు కార్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.820	రూ.900
రెండోరకం	రూ.700	రూ.800



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 84 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	600
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 518.180 కిలోలు

న్యూస్‌రీల్

నేడు రైల్వేకోడూరుకు ఎంపీ మిథున్‌రెడ్డి రాక

రైల్వేకోడూరు అర్బన్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం రైల్వేకోడూరుకు రానున్నారు. ఈ విషయాన్ని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి బుధవారం తెలిపారు. పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు సంకర జాతి దూడల ప్రదర్శన

రాయచోటి (జగదాంబసెంటర్): చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో ఈ నెల 3వ తేదీన ఉదయం 8 గంటలకు సంకరజాతి దూడల ప్రదర్శన, ఉచిత పశు చికిత్స శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఎంపిక చేసిన దూడలకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీనరసింహుని పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్రోత్సవాలు గురువారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయప్రధాన అర్చకులు గోపాలబట్టర్ తెలిపారు. స్వామివారికి చేయు అర్చనా దోషములను నివారించుటకు, యజ్ఞఫలములను ప్రసాదించుటకు, మన ఆత్మ, శరీరం, ఇంద్రియాలు, వాక్కు కర్మలను పవిత్రంగా చేసేందుకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా బుధవారం అర్చకులు అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 03న పవిత్ర ప్రతిష్ట, స్నపన తిరుమంజనం, యాగశాల కైంకర్యాలు జరుగుతాయి. 04న పవిత్ర సమర్పణ, యాగశాలకైంకర్యాలు, 05న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ, తిరువీధి ఉత్సవాలు నిర్వహించనున్నారు. పవిత్రసేవలో పాల్గొనదలిచిన దంపతులు రూ.300 చెల్లిస్తే ఒక పవిత్రమాల,స్వామివారి ఉత్తరీయం, రవిక, అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

రాయచోటి: సెలవురోజుల్లో ప్రైవేటు పాఠశాలలు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటించిందన్నారు. సెలవు రోజులలో ఏ విధమైన పాఠశాలలు, ప్రైవేటు తరగతులు, పిల్లలకు ఇతర ఎలాంటి తరగతులు నిర్వహించరాదన్నారు. ప్రభుత్వం ఉత్తర్వులను ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటామని డీఈఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కూచివారిపల్లె సెక్రటరీకి స్వచ్ఛతా హీ సేవా ప్రశంసాపత్రం



ప్రశంసా పత్రంతో నరసింహులు

రాజంపేట టౌన్: రాజంపేట మండలం కూచివారి పల్లె సెక్రటరీ ఈటమార్పురం నరసింహులుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛత హీ సేవా ప్రశంసాపత్రాన్ని అందజేసింది. ఢిల్లీలో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొన్న కార్యక్రమంలో ప్రశంసా పత్రాన్ని అధికారులు ప్రదానం చేసినట్లు నరసింహులు ఫోన్ ద్వారా విలేకరులకు తెలిపారు. కాగా మండలంలో పెద్దపంచాయితీల్లో ఒకటైన కూచివారిపల్లె పంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై తీసుకున్న చర్యలకు నరసింహులుకు కేంద్రం ప్రసంశా పత్రాన్ని అందచేసింది. రాష్ట్రంలో వివిధ విభాగాలకు చెందిన 17 మంది అధికారులకు స్వచ్ఛతా హీ సేవా ప్రసంశాపత్రం లభించగా, అందులో పంచాయితీ సెక్రటరీ విభాగంలో నరసింహులు ఒక్కరికే ఈ ఘనత దక్కడం విశేషం. నరసింహులు 2017వ సంవత్సరంలో స్వచ్ఛత సేవా పురస్కారం, 2018లో జాతీయ పంచాయతీరాజ్, దీన్‌దయాల్ ఉపాధ్యాయ స్వశక్తీకరణ, 2019లో ఘనవ్యర్థాల నిర్వహణ-స్వచ్ఛ సంక్రాంతి, 2022లో మండల స్థాయి ఉత్తమ ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ పురస్కారం, 2023, 2024వ సంవత్సరాల్లో ఉత్తమ సెక్రటరీగా డివిజన్ స్థాయి పురస్కారాలను సొంతం చేసుకున్నారు.

ప్రగతి ప్రతిపాదనలు పట్టాలెక్కేనా!

- జిల్లా మీదుగా కొత్తరైళ్లు వచ్చేనా
- కృష్ణపట్నం లైనులో ప్రయాణికుల ఎదురుచూపులు
- రైళ్ల వాటరింగ్‌కు నందలూరు రైల్వేకేంద్రం అనుకూలం

రాజంపేట: ఎంపీలు ఇచ్చే ప్రగతి ప్రతిపాదనలు పట్టాలెక్కించే దిశగా దక్షిణ మధ్య రైల్వే అడుగులు వేస్తుందా..లేక తమ నిర్ణయాలతో ముందుకెళుతుందా అనే అంశంపై అందరిలో ఆసక్తి నెలకొంది. కాగా ఇప్పటికే సమావేశానికి హాజరు కావాలని ఎంపీలకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఆహ్వానాలను పంపారు.

4న విజయవాడలో..

ఈనెల 4న విజయవాడలో ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఎంపీల నుంచి అజెండాకు సంబంధించిన ప్రతిపాదన లేఖలను అధికారులు సేకరించారు. ప్రధానంగా ఎంపీలు తమ ప్రాంత పరిధిలో నడిచే రైళ్ల హాల్టింగ్ అంశాలను సమావేశంలో పెట్టనున్నారు. కరోనా ముందు ఏ విధంగా రైళ్లకు హాల్టింగ్స్ ఉన్నాయో వాటినే పునరుద్ధరించాలని కోరనున్నారు.



ప్యాసింజర్ రైళ్లు నడవని కృష్ణపట్నం రైల్వేలైను

ఓబులవారిపల్లె-కృష్ణపట్నం రైలేదీ.!

ఓబులవారిపల్లె- కృష్ణపట్నం రైల్వే లైను రూ.6,660 కోట్లతో అందుబాటులోకి వచ్చింది. సెప్టెంబరు1న 2019లో రైలును ప్రారంభించారు. ఇప్పటి వరకు ఈ మార్గంలో ప్యాసింజర్ రైలును నడిపించలేదు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఓబులవారిపల్లె-కృష్ణపట్నం లైను ప్రారంభోత్సవ సభలో ప్యాసింజర్ రైళ్లు నడుస్తాయని ప్రకటించారు. ఇంతవరకు విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు ఎలాంటి ప్రతిపాదన చేయలేదు.

సర్వేకే పరిమితమైన రైలు మార్గాలు


ఉమ్మడి కడప జిల్లాలో ఇప్పటికీ రాయచోటి, పులివెందుల, బద్వేలు, మైదుకూరు ప్రాంతాలు రైలు కూతకు నోచుకోలేదు. గిద్దలూరు-భాకరాపేట, ప్రొద్దుటూరు-కంభం, ముద్దనూరు-ముదిగుబ్బ రైలుమార్గాలు సర్వేకే పరిమితమయ్యాయి.

ప్రధాన రైలు మార్గమైనా...

ముంబయి-చెన్నై ప్రధాన రైలు మార్గం పేరుకే కానీ రైళ్లు అరకొరే. వందేభారత్, అమృత్‌భారత్ లాంటి రైళ్లు ఈ మార్గంలో నడిపించరు. కోస్తా రైలు మార్గాలకు ఉన్న ప్రాధాన్యం ఈ రైలుమార్గానికి లేదన్న అపవాదును కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ మూటగట్టుకుంది. జిల్లా మీదుగా ఒక్కటంటే ఒక్క వందేభారత్‌ను ఇంత వరకు నడిపించలేదు. పగటిపూట తిరుపతి-కాచిగూడ మధ్య వందేభారత్‌ను జిల్లా మీదుగా నడిపించేలా ప్రతిపాదనలు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నందలూరుపై రైల్వేబోర్డు శీతకన్ను: ఇప్పటికే ఇక్కడికి వచ్చిన రైల్వే పరిశ్రమలను యూపీఏ సర్కారులో అప్పటి రైల్వే సహాయమంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలుకు, కూటమి పాలనలో ఇప్పుడు పాకాలకు చంద్రబాబు తరలించుకుపోయారు. ఈ నేపథ్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లోహిత్‌ను కలిసి నందలూరు రైల్వేకేంద్రం పూర్వవైభవం. ఇప్పుడున్న పరిస్థితులను వివరించారు. ఎంపీలు మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు నందలూరులో నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని రైళ్లకు వాటరింగ్ సెంటర్ ఏర్పా టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే రైల్‌నీర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు నందలూరు అనుకూలమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కొత్త రైళ్లు వేయండి ప్రభో..



- ఉమ్మడి కడప జిల్లామీదుగా బెంగళూరుకు వెళ్లేందుకు రైలొక్కటి కూడా లేదు. కడప-బెంగళూరు రైల్వేలైను నిర్మాణంలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే. బెంగళూరు-తిరుపతి మధ్య నడిచే 16220 (చామరాజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్) నంబరు రైలును కడప వరకు పొడిగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.
- గుత్తి-రేణిగుంట రైలుమార్గంలో ఉమ్మడి కడప జిల్లాలో గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ప్యాసింజర్ రైళ్ల సౌకర్యం కల్పించే ప్రతిపాదనలు ఏపీ పట్టాలెక్కడంలేదు. ఉదయం తిరుపతి వైపు, సాయంత్రం కడప వైపు ఒక ప్యాసింజర్ రైలు నడిపించే ప్రతిపాదన చేయాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు.
- తిరుపతి, విజయవాడకు జిల్లా మీదుగా ఎర్ర గుంట్ల-నంద్యాల మీదుగా నడిపించే విధంగా కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలని, అది రాత్రి తిరుపతి నుంచి బయలుదేరి ఉదయం విజయవాడకు చేరుకునేలా ఉండాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది.
- తిరుపతి నుంచి భద్రాచలం రోడ్డు వయా రేణిగుంట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, కడప, ఎర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు , విజయవాడ, ఖమ్మం, డోర్నకల్ మీదుగా రైలును ప్రవేశపెడితే ఏపీలోని ఒంటిమిట్ట రామాలయం, అటు తెలంగాణలోని భద్రాచలం రామాలయానికి అనుసంధానం చేసినట్లవుతుంది.
- కడప నుంచి నందలూరు, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పేట్, కుప్పం, బంగారుపేట కృష్ణరాజుపురం మీదుగా రాత్రి పూట ఒక సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని డిమాండ్ ఉంది.
- విశాఖపట్నం నుంచి తిరుపతికి వయా రాజమండ్రి, భీమవరం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నంద్యాల, ఎర్రగుంట్ల, కడప, నందలూరు , రాజంపేట, రేణిగుంట మీదుగా ప్రతిరోజు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని డిమాండ్ వినిపిస్తోంది.
- విజయవాడ నుంచి తిరుపతి వయా తెనాలి, ఒంగోలు, నెల్లూరు, వెంకటాచలం, కృష్ణపట్నం, ఓబులవారిపల్లె, రేణిగుంట మీదుగా ప్రతి రోజు ఒక రైలు నడపాలని కృష్ణపట్నం లైను ప్రాంతీయులు కోరుతున్నారు.
- కృష్ణపట్నం లైనులో కడప నుంచి నెల్లూరుకి ప్రతిరోజు మెమూ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలి. దీని వల్ల ఉమ్మడి కడప జిల్లావాసులకు ఎంతో ఉపయోగకరం.
- ప్రస్తుతం కడప నుంచి చండీగడ్, అగర్తలా, ది బ్రుబుడ్, గౌహతి, భువనేశ్వర్, హౌరా నగరాలకు వెళ్లడానికి ఒక్కటంటే ఒక్క రైలులేదు. అలాగే గూడూరు, నెల్లూరు ప్రజలకు ముంబయి, పూణే నగరాలకు వెళ్లేందుకు ఒక్కటంటే ఒక్క రైలులేదు. ఇరు ప్రాంత ప్రయాణికులకు ఈ రైళ్లను అనుసంధానం చేయడానికి కడప నుంచి నెల్లూరుకు మెమూ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతిపాదిత మార్గంలో నడపాలి.

నందలూరు పూర్వవైభవానికి ప్రతిపాదనలిచ్చాను



నందలూరు రైల్వే పూర్వ వైభవానికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు పంపాను. ఇందులో పలు రైళ్లకు వాటరింగ్ సెంటర్, ప్రత్యామ్నాయ రైల్వేపరిశ్రమ, రన్నింగ్‌క్రూ సెంటర్ బలోపేతం, మాడరన్ రన్నింగ్‌రూం నిర్మాణం లాంటివి కోరాను. అలాగే కరోనా ముందు రాజంపేట, రైల్వేకోడూరు, నందలూరు, ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్లలో పలు రైళ్ల హాల్టింగ్‌ను పునరుద్ధరించాలని కోరాను. కృష్ణపట్నం రైల్వేలైనులో ప్యాసింజర్ రైళ్లను నడపాలని సూచించాను.

-పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

అదనంగా రైళ్లను నడిపించాలి



ముంబయి-రేణిగుంట రైలుమార్గంలో ప్రయాణికుల కోసం అదనంగా కొత్త రైళ్లను నడిపించాలి. ముఖ్యంగా కేవలం గూడ్స్ రవాణాకే పరిమితమైన కృష్ణపట్నం లైనులో రైళ్లను నడిపించాలి. నందలూరు రైల్వే కేంద్రం నిర్వీర్యం కాకుండా పూర్వవైభవం కల్పించేలా రైల్వే యాజమాన్యం దృష్టి సారించాలని కోరాను. నందలూరులో పుష్కలంగా నీటివనరులను దృష్టిలో ఉంచుకొని రైళ్లకు వాటరింగ్ ఏర్పాటు చేయాలి. పలురైళ్ల హాల్టింగ్స్‌ను పునరుద్ధరించాలని కోరాను. కడప, నందలూరు, రాజంపేట మీదుగా తిరుపతి, చెన్నైకు కొత్తరైళ్లను ఈ మార్గంలో నడిపించాలి.

-మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, రాజంపేట

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి. చిత్రంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ తదితరులు

లక్కిరెడ్డిపల్లి: గ్రామ సభల ద్వారా ప్రణాళికలు రూపొందించుకోవాలని, పంచాయతీలు అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభ ప్రజా ప్రణాళిక కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సద్దల అహల్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీటి సమస్య ఉందని, ఇక్కడ వెయ్యి అడుగులు బోరువేసినా నీరు రావడం లేదని, ఎండిపోతున్న మామిడి తోటలకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. రాబోయే నాలుగున్నర సంవత్సరాలలో వెలిగల్లు ద్వారా అలైన్మెంట్ చేసి కాలువలు సరిచేసి చెరువులకు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

- జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ మొదటి దఫాలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 30 కోట్లు వచ్చాయని, పది రోజుల్లో మరో రూ. 30 కోట్లు రానున్నాయని, ఈ నిధులతో 30 శాతం వ్యర్థ పదార్థాల నిర్వహణకు వినియోగించనున్నట్లు చెప్పారు.కామన్ గుడ్ ఫండ్ ద్వారా రూ. 2.50 కోట్లు బోర్‌వెల్స్ కోసం మంజూరైందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మదనపల్లెలో దంచికొట్టిన వాన





ప్రశాంత్‌నగర్ ఎదురుగా ప్రధానరహదారిపై రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు, ఎంఎల్ఎల్ ఆస్పత్రి నుంచి మోతీనగర్‌కు వెళ్లే మార్గంలో మోకాలిలోతుకు నిలిచిన వర్షపునీరు

- 2 గంటల సేపు ఏకధాటిగా కురిసిన వర్షం
- లోతట్టుప్రాంతాలు జలమయం

మదనపల్లె: మదనపల్లె పట్టణంలో బుధవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ ఉండగా, మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత వర్షం మొదలైంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లోకి నీరుచేరింది. పట్టణంలోని ఎంఎల్ఎల్ ఆస్పత్రి, ప్రశాంత్‌నగర్, సుబ్బారెడ్డి లేఅవుట్, ఎన్‌వీఆర్ లేఅవుట్, అప్పారావువీధి, బెంగళూరు బస్టాండ్, బిసెంట్‌రోడ్, కురవంక, సిద్ధార్థకాలేజీరోడ్, దొంతివీధి, ఇందిరానగర్, ఆర్టీసీబస్టాండ్ అంబేద్కర్ సర్కిల్, పీఅండ్‌టీ కాలనీ, వైఎస్సార్ కాలనీ, బీకే.పల్లె, సప్తగిరినగర్, మంజునాథకాలనీ, చంద్రాకాలనీ, రామ్‌నగర్, బుగ్గకాలువ, బాపనకాలువ, మేదరవీధి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. బెంగళూరుబస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కృష్ణాథియేటర్ ఎదుట మురుగునీరు రోడ్లపై మోకాలిలోతుకు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గంటన్నర సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చౌడేశ్వరి సర్కిల్, మల్లికార్జున సర్కిల్, ఆర్టీసీబస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు వాన ధాటికి కుప్పకూలాయి.

నమామిమాతా.. నారాయణి

- నేటి నుంచి జిల్లా అంతటా దసరా సందడి
- శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు

రాయచోటి టౌన్/రాజంపేటటౌన్: దసరా పండుగ వచ్చేసింది.. తొమ్మిదిరోజులు నిర్వహించే పండుగ గురువారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని అన్ని అమ్మవారి ఆలయాలు ఉదయం, సాయంత్రం పూజలతో కళకళలాడనున్నాయి. సాయంత్రం రోజుకో అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల సందడి మొదలవుతుంది. ఆలయాలు ఉన్న వీధులన్నీ మండపాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో కళకళలాడనున్నాయి. బుధవారం రాత్రికి ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయ్యాయి. దాదాపు రెండు, మూడు వారాలుగా ఆలయాల వద్ద స్థాయిని బట్టి రాజమందిరాలను తలపించేలా సెట్టింగ్‌లు తీర్చిదిద్దారు. ఆలయాలన్నీ విద్యుత్ దీప కాంతులతో వెలుగొందుతున్నాయి.

రాయచోటిలో..

ఈ శరన్నవరాత్రి సందర్భంగా రాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళీ, శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవార్లు చెక్ పోస్టు వద్ద పార్వతీ అమ్మవారు, కొత్తపేటలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారు, పాత రాయచోటి శివాలయంలో పార్వతీ దేవి, బుగ్గ వద్ద ఉన్న గంగమ్మ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవార్లను దుర్గాదేవి, అన్నపూర్ణదేవి, పార్వతీ దేవి, భవానీ, గజలక్ష్మి , సరస్వతీదేవి, విజయలక్ష్మిదేవి,, వాసవాంబ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఉదయం పురాణ శ్రవణం, మంగళహారతి, తీర్థప్రసాదాలు, హరికథలు, అన్నమాచార్యుల కీర్తనలు, రాత్రివేళ కుంకుమార్చన, సుమంగళి పూజలు, లలితసహస్రనామ పారాయణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



శరన్నవరాత్రులకు ముస్తాబైన రాయచోటిలోని శ్రీ ఉమామహేశ్వరీ దేవి ఆలయం



రాజంపేట టౌన్: అమ్మవారిశాల వద్ద ఆకట్టుకునేలా భారీ సెట్టింగ్

రాజంపేటలో..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేటలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ముఖ్యంగా అమ్మవారి శాలలో జరిగే ఉత్సవాలకు ఆర్య వైశ్యులు లక్షాలాది రూపాయిలు వెచ్చిస్తారు. ఇక్కడ జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ప్రతి రోజూ రాత్రి వేళల్లో ప్రజలను ఉత్సాహపరిచే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మరింత ఘనంగా దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ఆర్య వైశ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎంపీకి ఆహ్వానం

రాజంపేట టౌన్: రాజంపేట అమ్మవారిశాలలో జరిగే దసరా ఉత్సవాలకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. తిరుపతిలోని ఎంపీ స్వగృహంలో బుధవారం మిథున్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందచేసినట్లు కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్ ఇక్కడి విలేకరులకు తెలిపారు. రాజంపేటలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, తప్పక ఉత్సవాల్లో ఏదో ఒకరోజు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటానని ఎంపీ తెలిపారన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సంతోషంగా, సంబరంగా జరుపుకోవాలని ఈసదర్భంగా మిథున్‌రెడ్డి ఆకాంక్షించినట్లు నవీన్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు అన్నపూర్ణ మురళీ, బవిరిశెట్టి సత్య, బింగి హరికృష్ణ, సనిశెట్టి నరేంద్ర, ఏల్చూరి గుప్త పాల్గొన్నారు.



ఎంపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

గిరిజన సాధికారతపై పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి: గిరిజన సాధికారతపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆవిష్కరించారు. ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ అభియాన్ పథకం, గిరిజనులు, గిరిజన ప్రాంతాల సాధికారతకు మేలు చేస్తుందని కలెక్టర్ అన్నారు. గిరిజన గ్రామాలకు విద్యుదీకరణ, రహదారుల సదుపాయం, అంగన్ వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలన్నీ ఇందులో పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన శాఖ అధికారి తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి



గాంధీజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటి: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ బి చిన్నికృష్ణ, పోలీసు మోటారు వాహనాల అధికారి ఎం పెద్దయ్య, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వారు బాపూజీ సేవలను కొనియాడారు.

పేదల డాక్టర్.. ఈసీ గంగిరెడ్డి

- చిన్నపిల్లల వైద్యుడిగా.. మంచి హస్తవాసిగా ప్రాచుర్యం
- రాజకీయ నాయకుడిగా తనదైన పాత్ర
- నేడు దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతి
- పాల్గొననున్న వైఎస్ కుటుంబ సభ్యులు


వైద్య సేవలో ఈసీ గంగిరెడ్డి(ఫైల్)

పులివెందుల రూరల్ : దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి పేదల డాక్టర్‌గా పులివెందుల ప్రాంతంలో గుర్తింపు పొందారు. ఆయన హస్తవాసి తగిలితే ఎంతటి రోగమైనా ఇట్టే నయమవుతుందని ఈ ప్రాంత వాసుల నమ్మకం. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఈసీ గంగిరెడ్డి చిన్నపిల్లల డాక్టర్‌గా ప్రాచుర్యం పొందారు. 1949 ఏప్రిల్ 20వ తేదీన ఈసీ సిద్ధారెడ్డి, తులశమ్మ దంపతులకు రెండవ సంతానంగా వేముల మండలంలోని గొల్లలగూడూరులో ఆయన జన్మించారు. తన విద్యాభ్యాసం 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు గొల్లలగూడూరు ఆర్‌సీఎం స్కూలు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పులివెందులలోని జెడ్పీ హైస్కూలులోనూ, 9వ తరగతి నుంచి 11వ తరగతి వరకు వేముల జెడ్పీ హైస్కూలులోనూ, అనంతరం వైద్య విద్యను వారణాసిలోని బెనారస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. అనంతరం పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రారంభించారు. తర్వాత పులివెందులలోని శ్రీనివాసహాలు వీధిలో తన సతీమణి డాక్టర్ ఈసీ సుగుణమ్మతో కలిసి గంగిరెడ్డి ఆసుపత్రి స్థాపించి దంపతులిద్దరూ వైద్య సేవలు అందించేవారు. వైద్యం చేయడమే ప్రధాన ఆశయంగా ప్రతిఫలం ఆశించని డాక్టర్‌గా ఇక్కడ గుర్తింపు పొందారు. ఎలాంటి రోగమైనా ఆయన దగ్గరకు వెళ్లి ఆయన చేయి పడితే నయమవుతుందని పులివెందుల ప్రాంత ప్రజల నమ్మకం. పులివెందుల ప్రాంత ప్రజలే కాకుండా జిల్లా నలుమూలల నుంచి పొరుగు జిల్లాలైన అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి కూడా ఆయన వద్దకు వచ్చి రోగులు వైద్య సేవలు పొందేవారు. వైద్య సేవలలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆయన భాకరాపురంలో అత్యాధునిక వైద్య పరికరాలతో తన కుమారుడి పేరిట దినేష్ నర్సింగ్ హోం (ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి) స్థాపించి వైద్య సేవలు అందించేవారు. ఈసీ గంగిరెడ్డి కుమారుడు ఈసీ దినేష్‌రెడ్డి కూడా వైద్యునిగా సేవలు అందిస్తున్నారు. ఈసీ గంగిరెడ్డి తన దగ్గరకు వచ్చే రోగులపట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలను కనబరిచేవారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 12 గంటలవరకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించేందుకు ఆయన తపన పడేవారు. దినేష్ నర్సింగ్ హోం ద్వారా అనేక ఉచిత మెగా మెడికల్ క్యాంపులు నిర్వహించి పేద ప్రజలకు సేవ చేసేవారు.

రాజకీయ ప్రస్థానం..

డాక్టర్ ఈసీ గంగిరెడ్డి 2001 నుంచి 2005 వరకు పులివెందుల మండల ప్రెసిడెంట్‌గా ప్రజలకు సేవలు అందించారు. వైఎస్ కుటుంబం పోటీ చేసే ప్రతి ఎన్నికలలోనూ ఆయన తన వంతు పాత్ర పోషించేవారు. ఎన్నికల సమయంలో వైఎస్ కుటుంబానికి మద్దతుగా నియోజకవర్గంలో ఆయన ప్రచారం నిర్వహించేవారు. 2003 రబీ సీజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతులకు విత్తనాలు సక్రమంగా సరఫరా చేయలేదని పులివెందుల నుంచి కడప కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు.

నేడు దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతి

దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి నాలుగో వర్ధంతిని గురువారం పులివెందులలో ఘనంగా నిర్వహించనున్నారు. డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో ఉన్న డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఘాట్ వద్ద గురువారం డాక్టర్ ఈసీ గంగిరెడ్డి కుమార్తె వైఎస్ భారతిరెడ్డి, సతీమణి ఈసీ సుగుణమ్మ, వైఎస్ కుటుంబీకులు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. అనంతరం స్థానిక భాకరాపురంలో గల దినేష్ నర్సింగ్ హోంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

గాంధీ సాక్షిగా పంచాయతీ కార్యదర్శికి అవమానం


అడవికమ్మపల్లె గ్రామ సభలో నేలపై కూర్చున్న పంచాయతీ కార్యదర్శి

రాయచోటి : జాతీపిత మహాత్మాగాంధీ చిత్రపటం సాక్షిగా పంచాయతీ కార్యదర్శికి అవమానం జరిగింది. సంబేపల్లె మండల పరిధిలోని అడవికమ్మపల్లెలో బుధవారం జరిగిన గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అసు నాయక్‌ను నేలపై కూర్చోబెట్టి టీడీపీ నాయకులు మాత్రం కుర్చీలపై కూర్చోవడం ఏమిటని పలువురు చర్చించుకొంటున్నారు. ఆ కార్యదర్శి ఎస్టీ కావడంతో నెలపై కూర్చోబెట్టారని సర్వత్రా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఆటో బోల్తా

– నలుగురికి గాయాలు

చిట్వేలి : మండల పరిధిలోని చిట్వేలి–పుల్లంపేట ప్రధాన రహదారిలో మిట్టపల్లి క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఆటో బోల్తాపడటంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రఘురాం కథనం మేరకు.. మండల పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన ఎం.హరి (33), పెంచలమ్మ (40), రేణుక (30), అచ్చమ్మ(50)లు రాజంపేట నుంచి చిట్వేలి వైపు వస్తుండగా మిట్టపల్లి క్రాస్ రోడ్డు వద్ద అడవి పందులు అడ్డు రావడంతో ఆటో బోల్తా పడినట్లు బాధితులు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాజంపేటకు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


స్వర్ణకుమారి (ఫైల్)

మదనపల్లె : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లిలోని జగన్ కాలనీలో స్వర్ణకుమారి (63) ఒంటరిగా నివసిస్తోంది. ఆమె కుమారుడు నాగేంద్రప్రసాద్ అనంతపురం జిల్లా ధర్మవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 29న తన ఇంటి వద్ద ఉన్న వెంకటేష్ అనే వ్యక్తితో కలసి ద్విచక్ర వాహనంలో, పుంగనూరు రోడ్డులో ఉన్న ఓ స్వామి వద్ద అనారోగ్య సమస్యలు తగ్గించుకోవడంలో భాగంగా మంత్రించుకునేందుకు వెళ్లింది. అయితే ఆమె సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడం, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుమారుడు నాగేంద్ర ప్రసాద్ బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440796742,9440796743 నంబర్లకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

వివాహిత ఆత్మహత్య

చక్రాయపేట : మండలంలోని మారెళ్లమడక గ్రామం కొండవాండ్లపల్లెకు చెందిన రమాదేవి(28) అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆర్కే వ్యాలీ పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా ఆమె కడుపునొప్పితో బాధ పడుతుండేదని చెప్పారు. దీంతో ఆమె నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి 8 సంవత్సరాల లోపు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు.


వృద్ధులపై టీడీపీ వర్గీయుల దాడి



టీడీపీ వర్గీయుల చేతిలో దాడికి గురైన వృద్ధ దంపతులు వెంకటరమణ, నారాయణమ్మ

చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో టీడీపీ వర్గీయులు వృద్ధులపై దాడి చేశారు. ఈ సంఘటన నెరుసుపల్లె గ్రామం దేవరగుట్టపల్లెలో జరిగింది. బాధితులు వెంకటరమణ, నారాయణమ్మలు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత 60 ఏళ్ల నుంచి తమ అనుభవంలో ఉన్న భూమిని టీడీపీ వర్గీయులైన దాసరి నాగేంద్ర, నాగమునిలు ఆక్రమించుకొని ఉలవ పంట వేశారు. తమ పొలం తమకు వదిలేయండి అని ప్రాధేయపడినా వారు వినిపించుకోలేదు. దీంతో వీరు పంటను దున్నేశారు. ఈ కారణంగా ఇంట్లో ఉన్న తమపై టీడీపీ వర్గీయులు దాడి చేసి కొట్టారని బాధితులు తెలిపారు. విడిపించేందుకు అడ్డుగా వచ్చిన తమ కూతురిపై కూడా దాడి చేశారని వాపోయారు. ఈ సంఘటనపై నాగేంద్ర, నాగముని, ప్రత్యూషలతో పాటు మరొకరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

గుప్త నిధుల ముఠా విధ్వంసం

గతంలో గోపురం.. ఇప్పుడేమో ధ్వజస్తంభం


నేల కూలిన ధ్వజ స్తంభం


గుప్త నిధుల కోసం ఆలయం ఎదుట తవ్విన గుంత

పెద్దతిప్పసముద్రం : గుప్త నిధుల ముఠా సభ్యులు ఆలయాలను సైతం వదలడం లేదు. గుప్త నిధులు ఉంటాయనే ఆశతో ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాన్ని సైతం పెకిలించేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలోని కందుకూరు వ్యాసరాయ చెరువు కట్ట కింద పురాతన కాలం నుంచి శ్రీ వేదగిరి నరసింహస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం నిర్జన ప్రదేశంలో ఉంది. ఎలాంటి జన సంచారం ఉండదు. వారానికోసారి ప్రతి శనివారం కందుకూరు నుంచి గంగాధర్ శాస్త్రి అనే పూజారి ద్విచక్ర వాహనంలో వచ్చి పూజలు చేసి వెళ్లేవారు. ఈ నేపథ్యంలో పూజారి అందుబాటులో లేని కారణంగా గత శనివారం పూజలు జరగలేదు. తిరిగి పూజారి ఆదివారం ఆలయానికి వెళ్లగా గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభాన్ని తవ్వి పెకలించేసినట్లుగా గుర్తించారు. అనంతరం పూజారి జరిగిన విషయాన్ని ఆలయ ధర్మకర్త కరణం ప్రకాష్‌రావ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. తాను హైదరాబాద్‌లో ఉన్నానని ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని పూజారికి ధర్మకర్త సూచించినట్లు సమాచారం. అయితే గతంలో కూడా ఈ ఆలయంపై ఉన్న గోపురాన్ని ధ్వంసం చేశారు. అంతేగాక పూజలు చేసేందుకు వచ్చే పూజారి తన ద్విచక్ర వాహనాన్ని చెరువు కట్టపై ఉంచి దిగువ భాగంలో ఉన్న ఆలయానికి వెళ్లి వచ్చేవారు. గతంలో ఇదే పూజారి పూజ ముగించుకుని వచ్చేలోగా కట్టపై ఉంచిన తన ద్విచక్ర వాహనం కూడా అపహరణకు గురైంది. పోలీసులు గుప్త నిధులు, చోరీ ముఠాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కన్ను పడితే.. బైక్ మాయం

ప్రొద్దుటూరు క్రైం : అతను జల్సాలకు అలవాటు పడ్డాడు. అతని కన్ను పడితే బైక్ మాయం కావాల్సిందే. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను ఎంచుకొని చాకచక్యంగా మాయం చేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అతను చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. బైక్‌లను చోరీ చేస్తూ పట్టణంలో పోలీసులతో పాటు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న సోమిరెడ్డిపల్లె లాజరయ్య అనే దొంగను టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ వివరాలను టూ టౌన్ సీఐ యుగంధర్ బుధవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. బి.మఠం మండంలోని నరసన్నపల్లె హరిజనవాడకు చెందిన లాజరయ్య కూలి పని చేసుకొని జీవనం సాగించేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్‌లను దొంగిలించాలని భావించాడు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను ఎంచుకొని చోరీ చేసేవాడు. నకిలీ తాళం చెవి సాయంతో లాక్ తీసి బైక్‌లను కొట్టేసేవాడు. ఈ క్రమంలో తమ బైక్‌లు కనిపించలేదని చాలా మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూ టౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. లాజరయ్య అనే వ్యక్తి బైక్‌లను చోరీ చేసినట్లు నిర్ధారించుకున్నారు. చోరీ చేసిన బైక్‌లను బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయించాలనే ఉద్దేశంతో వాటిని బి. మఠం మండలంలోని తన ఇంటి వద్ద కంపచెట్లలో దాచి పెట్టాడు. బుధవారం మడూరు రోడ్డులోని ప్రకాష్‌నగర్ వద్ద టూ టౌన్ సీఐ యుగంధర్, ఎస్‌ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రారెడ్డిలు సిబ్బందితో కలిసి నిందితుడు లాజరయ్యను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరచిన సిబ్బంది రవీంద్రనాయక్, రామాంజులును డీఎస్పీ భక్తవత్సలం, సీఐ యుగంధర్‌లు అభినందించారు.

చేపల వలలో చిక్కుకుని బాలుడి మృత్యువాత


మృతి చెందిన షేక్ ఇస్మాయిల్

సిద్దవటం : పుల్లంపేటలోని జెండామాను వీధికి చెందిన షేక్ జాఫర్ హుస్సేన్ కుమారుడు షేక్ ఇస్మాయిల్(6) బుధవారం సిద్దవటంలోని పెన్నానది నీటిలో మునిగి మృతి చెందాడని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పుల్లంపేటలోని జెండామాను వీధికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్, షేక్ సాబీర్ అనే అన్నదమ్ములు పిల్లలకు సెలవు కావడంతో బుధవారం తన కుటుంబీకులతో సిద్దవటంలోని కోటను చూసి, పెన్నా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే ఖాజామొహిద్దీన్ పెద్ద తమ్ముడు షేక్ జాఫర్ హుస్సేన్ చిన్న కుమారుడు ఇస్మాయిల్ నేను వస్తానని మారాం చేస్తుంటే ఆ బాలుణ్ని వెంట పెట్టుకొని వచ్చారు. సిద్దవటం పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద ఉన్న నీటిలో ఈత కొడుతుండగా ఒక్కసారిగా ఇస్మాయిల్ లోతులోకి వెళ్లి మునిగి పోయాడు. బాలుని పెద్దనాన్న, చిన్నాన్నలు లోతు నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఫలితం లేకుండా పోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక ఈతగాళ్లను రప్పించి నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు చేపల వలకు చిక్కుకున్న బాలుడిని బయటకు తీశారు. ఇస్మాయిల్ పుల్లంపేటలోని శాంతినికేతన్ స్కూల్‌లో 1వ తరగతి చదువుతున్నాడు. షేక్ జాఫర్ హుస్సేన్, జరీనా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు, మృతుడు ఇస్మాయిల్ చివరి వాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానిన కడప రిమ్స్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఆ వైపు ఎందుకు వెళ్లినట్లు..!

సర్కారుతోపు ప్రమాదంపై తర్జన భర్జన


ఎడమ వైపు కాకుండా కుడి వైపు రూట్‌లో వెళుతున్న ఆర్టీసీ బస్సు (సీసీ ఫుటేజీ దృశ్యం)

కురబలకోట : కురబలకోట మండలంలో సర్కారుతోపు మలుపు వద్ద మంగళవారం హైవేపై భారీ కంటైనర్ వాహనం గాలీవీడు–మదనపల్లె ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటన అందరిని ఆశ్చర్యచకితుల్ని చేస్తోంది. ఈ సంఘటన ఎలా జరిగిందన్నది అధికారుల్లో సైతం తర్జన భర్జనగా మారింది. ఎందుకంటే విశాలమైన ఫోర్‌వే రోడ్డు కొత్తగా వేశారు. మధ్యలో డివైడర్ కూడా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆ మార్గంలో సీసీ ఫుటేజీ పరిశీలిస్తే మదనపల్లెకి ఎడమ వైపు రూట్‌లో వెళ్లాల్సిన బస్సు కుడి వైపు రూట్‌లో వెళ్లడం కన్పిస్తోంది. ఆ మార్గంలో ఇంకా అక్కడక్కడా చిన్నపాటి రోడ్డు పనులు జరుగుతున్నాయి. వాళ్లు ఏమైనా డైవర్షన్ ఇచ్చారా.. మరేమిటన్నది అంతుబట్టడం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో రోడ్డుకు రెండు వైపులా ఏ రూట్‌వి ఆ రూట్‌లో వాహనాలు వెళుతున్నట్లు సీసీ ఫుటేజీలో కన్పిస్తోంది. అలాంటప్పుడు ఆర్టీసీ డ్రైవర్ ఎందుకు రాంగ్ సైడ్ వెళ్లినట్లు అర్థంకాని విషయంగా మారింది. రోడ్డు పనుల వల్ల ట్రాఫిక్ మళ్లించలేదని హైవే అధికారులు కూడా చెబుతున్నారు. ఇందుకు ఆధారంగా సీసీ ఫుటేజీ చూపిస్తున్నారు. ప్రమాదం జరగడానికి కొద్ది క్షణాల వరకు వరకు కూడా రెండు వైపులా వాహనాలు వెళుతున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ సంఘటనలో బస్సులోని 32 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆర్టీసీ డ్రైవర్ రామకృష్ణ తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కండక్టర్ సురేష్ కోలుకుంటున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మిగిలిన బాధితులు పలువురు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ముదివేడు పోలీసులు కంటైనర్‌ను స్వాధీనం చేసుకుని దాని డ్రైవర్ సలీమ్‌పై కేసు నమోదు చేశారు. పోలీసు, రవాణా శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని అన్ని కోణాల్లో పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బుధవారం తెలిపారు.

కేంద్రంలో నిరంకుశ పాలన


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : కేంద్రంలో బీజేపీ అధికార మత్తులో నిరంకుశ పాలన సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ విమర్శించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండు రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి పలువురికి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలన అంతమవ్వాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసి గాంధీ విగ్రహానికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలనలో బడుగు బలహీనవర్గాలపై ఎన్నో అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నా బీజేపీ ఏమీ తెలియనట్లు నటిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయచోటి చెన్నకృష్ణ, పి.మహమ్మద్‌అలీఖాన్, పి.ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

- మొన్న రిమ్స్‌లో తమ పేర్లు లేవని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు
- నేడు మేయర్‌కు ఆహ్వానం లేకుండానే గాంధీ ప్లాజా ప్రారంభం


గాంధీ ప్లాజాను ప్రారంభిస్తున్న కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి

కడప కార్పొరేషన్ : ప్రజా ప్రతినిధులకు సరైన గౌరవం ఇచ్చి ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు ఈ మధ్య కాలంలో తరచూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. కొందరు ప్రజా ప్రతినిధుల మెప్పు కోసం ఇలా చేస్తున్నారా.... లేదా ప్రొటోకాల్ తెలియక చేస్తున్నారా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మొన్న రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వైద్య, ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకంలో మంత్రి పేరు మినహా మరెవరి పేర్లు రాయలేదు. దీంతో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డిలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల పేర్లయితే అసలే రాయలేదు. ఇది మర్చిపోకముందే బుధవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని ఎర్రముక్కపల్లెలో గాంధీనగర్ ఉన్నత పాఠశాల ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పూర్తి చేసిన గాంధీప్లాజాను ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. కాగా ఈ కార్యక్రమానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డినిగానీ, నగర ప్రథమ పౌరుడైన మేయర్ సురేష్ బాబును ఆహ్వానించడంగానీ, శిలాఫలకంలో వారి పేర్లు రాయడంగానీ చేయలేదు. నగరపాలక అధికారుల తీరుపై మేయర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు సీడీఎంఏకు లేఖ రాసినట్లు తెలిసింది. ప్రజా ప్రతినిధులందరినీ గౌరవించాల్సిన అధికారులు ఇలా పక్షపాతంగా ఒకరి మెప్పు కోసం మరొకరి హక్కులను కాలరాయడం...అవమానించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వివాహేతర సంబంధమా.. ఆర్థిక లావాదేవీలా?

- కానిస్టేబుల్ కేసులో ఎన్నో అనుమానాలు
- సంఘటనపై నోరువిప్పని కానిస్టేబుల్


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్

పెండ్లిమర్రి : కడప–పులివెందుల ప్రధాన రహదారిలోని వైవీయూ వద్ద గత సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న సంఘటనలో ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివాహేతర సంబంధాలా లేక ఆర్థిక లావాదేవిల కారణంగా హత్యాయత్నం జరిగిందా అనే చర్చ జరుగుతోంది. కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికి సంఘటన గురించి నోరు విప్పడం లేదు. సంఘటన స్థలానికి చేరుకున్న బంధువులు, స్నేహితులు తొలుత రోడ్డు ప్రమాదంగా భావించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించగా పలు అనుమానాలు రావడం, కారుకు ఎలాంటి నష్టం జరగకపోవడం, చిన్నపాటి రంపం దొరకడంతో పోలీసులు రహస్యంగా విచారణ చేపడుతున్నారు. సంఘటన గురించి పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటికే పోలీసులు కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. మంగళవారం రాత్రి పెండ్లిమర్రి మండలంలో శ్రీనివాస్‌రెడ్డి బంధువులను, 108 సిబ్బందిని పిలిపించి విచారణ చేపట్టారు. సంఘటనకు ముందు, జరిగినప్పటి నుంచి కానిస్టేబుల్ ఎవరికి ఫోన్ చేశాడు. అని కాల్ లిస్ట్ ఆధారంగా విచారణను కొనసాగిస్తున్నారు. పెండ్లిమర్రి, వేంపల్లె సీఐల ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవా రం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాదుల్లా కుమారుడు అల్లాబక్ష్ (35) పట్టణంలోని చర్చి వద్ద పండ్ల దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. వ్యాపార అవసరాల నిమిత్తం పలువురి వద్ద దాదాపు రూ. 20 లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పులు సకాలంలో తిరిగి చెల్లించకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో బుధవారం ఇంటి వద్ద ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఐసీయూ విభాగంలో చికిత్స అందిస్తున్నారు. వన్ టౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


కలెక్టరేట్ ఎదుట రిలేదీక్ష చేస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : విశాఖ ఉక్కు కార్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం మానుకోవాలంటూ కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న రిలేదీక్షలు 2వ రోజైన బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు రామాంజులు, సాంబశివ, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సీపీఐ (ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు ఎం.విశ్వనాథ మాట్లాడుతూ నష్టాలలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లను సహాయంగా అందజేసి ఆదుకోవాలన్నారు. పరిశ్రమ నుంచి తొలగించిన 4వేల మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు రవికుమార్, లిబరేషన్ నేతలు పూసపాటి రమణ, సుజాత, వ్యవసాయ కార్మిక సంఘం నేత తోపుక్రిష్టప్ప, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, డీసీహెచ్‌సీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి, మండెం సుధీర్‌కుమార్, రైతు సంఘం జిల్లా నేత వంగిమళ్ల రంగారెడ్డి, నాగబసిరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐటీయూసీ నేతలు సురేష్, సలీంబాషా, సికిందర్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిద్ధమ్మ, అరుణ, నాగేశ్వరితో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్లను అద్దెకు తీసుకుని.. ఆపై కుదువ పెట్టి..

- చీటింగ్‌కు పాల్పడిన ఇద్దరి అరెస్ట్
- రూ. 2కోట్ల విలువైన 37 కార్లు స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : తమకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ అధికారులు పరిచయమని, నెలకు రూ. 30వేలు కారుకు అద్దె చెల్లిస్తామంటూ కొద్ది నెలలు అద్దె చెల్లిస్తారు. కార్లు తిరిగి ఇవ్వకుండా కార్లకు అద్దె చెల్లించకుండా ఉంటూ మోసానికి పాల్పడిన కడప నబీకోటకు చెందిన నిమ్మకాయల వెంకట శశిధర్‌రెడ్డి (38), షేక్ జిలానీ (21) అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 2కోట్ల విలువైన వివిధ కంపెనీల 37 కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కడప నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కడప నగరం నబీకోటకు చెందిన వీరేందర్ అనే బాధితుడు తన మూడు కార్లు అద్దెకు తీసుకుని మొదటి రెండు నెలలు అద్దె చెల్లించి తరువాత అద్దె ఇవ్వకుండా, కార్లు ఇవ్వకుండా మోసం చేశారని నిమ్మకాయల శశిధర్‌రెడ్డి, షేక్ జిలానీలపై సెప్టెంబర్ 25న కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అద్దె పేరిట మరో 34 కార్లను తీసుకుని యజమానులను మోసం చేసి కుదువకు పెట్టినట్లు పోలీసులు విచారణలో గుర్తించారన్నారు. దాదాపు 15 మంది వద్ద రూ. 47 లక్షలకు కుదువపెట్టి మొత్తం రూ. 2 కోట్ల విలువైన 37 కార్లను తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. దాదాపు 20 మంది కార్ల యజమానులు బాధితులుగా ఉంటారన్నారు. కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్ పర్యవేక్షణలో అతి తక్కువ సమయంలో కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు రూ. 2కోట్ల విలువైన 37 కార్లను రికవరీ చేసిన కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి. తాహీర్ హుసేన్, హెడ్‌కానిస్టేబుళ్లు శేఖర్, విద్యాసాగర్, కానిస్టేబుళ్లు రమేష్, సునీల్‌లను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.